212) గౌళ

ప॥ ఒడబరచుకొంటిని వుపేంద్ర నిన్ను నిపుడె । చిడిముడి నీసేవకే నెలవుచేసుకొమ్మీ ॥

చ॥ కన్నుల నే జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే । విన్నవినుకులెల్లా విష్ణుడ నీకథలే ।
తిన్నని నామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే । అన్నిటా నాభావము సమర్పణము నీకును ।

చ॥ అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే । గుట్టున నాసేతలెల్లా గోవింద నీకైంకర్యాలే ।
ముట్టి నేభుజించినవి ముకుంద నీప్రసాదాలే । నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి ॥

చ॥ యిల నే బండబడేవి యీశ్వర నీకు మొక్కులే । తలచే నాతలపెల్లా దామోదర నీధ్యానమె ।
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను । నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి ॥